క్లుప్తంగా

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ



పంపిణీ చేస్తున్న పోలీసులు, ఫౌండేషన్ సభ్యులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ పోలీసులు బుధవారం యాచకుల, నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ చేతుల మీదుగా ఆలయ సమీపంలో దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రతకు తట్టుకోలేని నిరాశ్రయులకు సహకారం అందించాలని కోరారు. యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై మారుతి, కానిస్టేబుల్ గొడిశెల రాజశేఖర్, యువ ఫౌండేషన్ యువకులు ప్రశాంత్, గంగరాజు, అరుణ్ సింగ్, అరవింద్, రామ్ కుమార్, సాయి, రాకేశ్, గడ్డం ప్రశాంత్, సిరి చందన, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప మహా పడిపూజ

- ముస్తాబైన అల్మాస్‌పూర్‌లోని అయ్యప్ప ఆలయం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అయ్యప్ప స్వాములు


ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్‌లోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం మండల మహాపడిపూజ మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు సైతం చేశారు. రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో మాలధారులు, భక్తులు రానున్నారు. గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 5.30 గంటలకు నగర సంకీర్తన, 6 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, బలిహరణ నిర్వహిస్తారు. ఉదయం 8.30 గంటలకు గ్రామంలో స్వామి వారి పల్లకీసేవా, 11 గంటలకు అష్టాభిషేక పూజలు, మహాహారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు గురుస్వాములు శ్రీను, నాగెల్లి ఇంద్రారెడ్డి వివరించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి ఆభరణాల ఊరేగింపు, 7 గంటలకు దీపారాధన, ముస్తాబాద్ రాజు గురుస్వామి ఆధ్వర్యంలో రాత్రి 7:30 నుంచి మహా పడిపూజ, రాత్రి 10 గంటలకు హరివరాసనం, తీర్థప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సన్మానం



తంగళ్లపల్లి: ప్రెస్‌క్లబ్ తంగళ్లపల్లి కార్యవర్గాన్ని బుధవారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బొల్లి రామ్మోహన్ సన్మానించారు. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి అండగా ఉంటానని సమాజం శ్రేయస్సులో పాత్రికేయుల పాత్ర ప్రముఖమైనదని బొల్లి రామ్మోహన్ అన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు దుబ్బాక రాజు, ప్రధాన కార్యదర్శి రెడ్డి రాజశేఖర్, కోశాధికారి గడగోని సాగర్, సహాయ కార్యదర్శి గ్యాదన వేని మధు, సాంస్కృతిక కార్యదర్శి రెడ్డిమల్ల దేవరాజు, లీగల్ అడ్వయిజర్ వెంగల శ్రీనివాస్, సలహాదారు సామల గట్టు తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో వీధికుక్కల బెడద



రోడ్డుపై కుక్కల గుంపు

ముస్తాబాద్ : మండలంలోని గూడెంలో వీధి కుక్కల బెడద పెరిగిపోతోంది. గుంపులుగా తిరుగుతున్న గ్రామ సింహాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే కుక్కల దాడిలో పలువురు గాయపడ్డారని గ్రామస్తులు తెలిపారు. దీంతో పని నిమిత్తం బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. వీధికుక్కలను నియంత్రించాలని, దాడుల నుంచి కాపాడాలని కోరుతున్నారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా పట్టించుకొని కుక్కల బెడదను నియంత్రించాలన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేములవాడ : చిన్నారులతో కేక్ కట్ చేస్తున్న వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి



వేములవాడరూరల్: శాత్రాజుపల్లిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బోయినపల్లి : వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యం, క్రైస్తవులు

వేములవాడ/వేములవాడ అర్బన్/వేములవాడ రూరల్/ ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/చందుర్తి/బోయినపల్లి/ తంగళ్లపల్లి/వీర్నపల్లి/ఇల్లంతకుంట: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలు బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు, మండలకేంద్రాలు, గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొని స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. చర్చిల్లో పాస్టర్లు దైవ సందేశాలు చదివి వినిపించారు. ప్రజాప్రతినిధులు, క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లంతకుంట: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఎల్లారెడ్డిపేటలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు, పాస్టర్లు



ముస్తాబాద్: క్రిస్టియన్లకు బహుమతులు అందిస్తున్న చక్రధర్‌రెడ్డి, పాస్టర్లు



చందుర్తి : ఎన్గల్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఆది శ్రీనివాస్, నాయకులు



గంభీరావుపేట: కేక్ కట్‌చేస్తున్న క్రైస్తవులు



వీర్నపల్లిలో..



తంగళ్లపల్లి: పద్మనగర్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ముస్తాబాద్ : మాట్లాడుతున్న రూరల్ సీఐ మొగిలి



కోనరావుపేట: మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

- సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి

ముస్తాబాద్: యువత మత్తు పదార్థాలు, గంజాయి వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. ముస్తాబాద్ ఇందిరమ్మ, కేసీఆర్ కాలనీల్లో పోలీసుల మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు మత్తు, గంజాయి వంటి వాటికి అలవాటు పడితే సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, గుర్తు తెలియని నెంబర్లనుంచి ఫోన్‌లు వచ్చినా, మెస్సెజ్‌లు వచ్చినా స్పందించవద్దన్నారు. కుల బహిష్కరణలకు ఎవరూ పాల్పడవద్దన్నారు. ప్రతిఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలతో చోరీలు, ఇతర సంఘటనలు జరగకుండా చూడవచ్చన్నారు. ఎస్సై గణేశ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని సుద్దాలలో మీ కోసం పోలీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ మాట్లాడారు. అపరిచితుల ద్వారా వచ్చే ఎస్ఎంఎస్, ఈమెయిల్స్, వాట్సాప్ ద్వారా వచ్చే లింకులను క్లిక్ చేస్తే మీ మొబైల్ లోని డాటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలన్నారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు, డ్రంకెన్ డ్రైవ్, సీసీ కెమెరాల ఏర్పాటు, రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకునుడే..

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని జూనియర్ కాలేజీ పక్కనే సిరిసిల్లకు వెళ్లేదారిలో చికెన్ వ్యర్థాలు పడేస్తుండడంతో పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి. కుక్కలు, పందులు గుంపులుగా తిరుగుతుండగా విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.



సిరిసిల్లకు వెళ్లే బీటీరోడ్డు పక్కన వ్యర్థాలు

సాక్షి విలేకరికి పరామర్శ



కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటకు చెందిన సాక్షి ఆర్సీ ఇన్‌చార్జి వూరడి మల్లికార్జున్ తల్లి వూరడి రామవ్వ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను హైదరాబాద్ సీఐడీ ఎస్పీ భూక్యా రాంరెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుమారులు సత్తయ్య, తిరుపతి, మల్లికార్జున్‌కు మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట బంజారా నాయకులు సంతోష్ నాయక్ తదితరులున్నారు.

వాహనం బోల్తా.. వికలాంగుడి మృతి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లికి చెందిన వికలాంగుడు వాహనం మంగళవారం రాత్రి బోల్తాపడగా తీవ్రగాయాలతో మృతిచెందినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మహమ్మద్ షాహిద్ (26) అనే వికలాంగుడు తన వాహనంపై ఎల్లారెడ్డిపేటకు వచ్చి తిరిగివెళ్తుండగా నారాయణపూర్ శివారులో బోల్తాపడింది. అటు వైపు ఆర్టీసీ బస్సులో బస్సులో వెళ్తున్న బండలింగంపల్లి గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని, ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహాతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి అక్క ఆసియా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని గీతా విద్యాలయం ఉన్నత పాఠశాలలో 2004–05లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం మంజునాథ పంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో చదివిన అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు అప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు వేములవాడ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మహేశ్, మహేశ్‌రెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజేందర్, దేవేందర్, శశికాంత్, రజిత, రమేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలో ప్రధాన రహదారిపై గుంతలు పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. అసలే మూలమలుపు ఆపై గుంతలు పడిన సిమెంట్ రోడ్డు అప్రమత్తంగా లేకపోతే కిందపడి పోవడం ఖాయం. అదేవిధంగా సీతారాంబజార్ కూడలిలో టీ ఫైబర్ కోసం సీసీ తవ్వి అలాగే వదిలేశారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
నరేందర్ ఏఈ, సెల్ నెంబర్ : 9440818863

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఆలయ ఆవరణలో మాంసాహారం పంపిణీ

- అడ్డుకున్న బీజేపీ నాయకులు

వేములవాడ: రాజన్న ఆలయ ఆవరణలో అన్యమతస్తులు మాంసాహారాన్ని పంపిణీ చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు చికెన్‌తో కూడిన ఆహారాన్ని పంపిణీ చేయకుండా అడ్డుకున్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా పలువురు ఆహార పొట్లాలను పేదలకు అందజేశారు. కొందరు రాజన్న ఆలయ లడ్డూల కౌంటర్లు, శివుడి విగ్రహం ఉన్న మెట్ల వద్ద నాన్‌వెజ్ ఆహారం పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు పిన్నింటి హన్మండ్లు, నామాల శేఖర్, రాజశేఖర్, రాహుల్, కోరెపు నరేశ్, లక్ష్మీరాజం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ అధికారుల భద్రతా లోపంతోనే ఇలా జరుగుతోందని బీజేపీ పట్టణాధ్యక్షుడు సంతోష్‌బాబు ఆరోపించారు. ఈ అంశంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు సంతోష్‌బాబు తెలిపారు.

ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట: ప్రతి ఒక్కరూ ఉదయం నిద్రలేచిన అనంతరం దేవుడిని స్మరించుకుంటే ఆ రోజు శుభం జరుగుతుందని, అర్చకులు బీటుకూరి వేణుగోపాలచారి, నవీన్‌చారి అన్నారు. మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పదో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్, వైస్ చైర్మన్ వెంకటేశ్ గౌడ్, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారు బైపాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గట్టిపల్లి వెంకటేశ్ జిల్లా ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా బైపాస్ వద్ద అతివేగంతో వెళ్తున్న డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్ తలకు గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండగా చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వాజ్‌పేయ్‌కి ఘన నివాళి



సిరిసిల్ల కల్లరల్: అంబేడ్కర్ చౌక్‌లో వాజ్‌పేయ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



ముస్తాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



కోనరావుపేట: నాగారంలో కేక్ కట్‌చేస్తున్న నాయకులు



వేములవాడఅర్బన్: నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్లకల్చరల్/వేములవాడ అర్బన్/ముస్తాబాద్/బోయినపల్లి/తంగళ్లపల్లి/కోనరావుపేట/ఇల్లంతకుంట: మాజీ ప్రధాని, అటల్ బిహారీ వాజ్‌పేయ్ జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా శాఖ, జయంతి ఉత్సవ సమితి కన్వీనర్, మున్సిపల్ కౌన్సిలర్ గూడూరి భాస్కర్ ఆధ్వర్యంలో వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వేములవాడ నందికమాన్ వద్ద వేములవాడ అర్బన్ మండల బీజేపీ అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, ముస్తాబాద్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, బోయినపల్లి మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా, తంగళ్లపల్లి బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో, కోనరావుపేట, ఇల్లంతకుంట మండలాల్లో వాజ్‌పేయి చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగుండారంలో బుధవారం పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంగా మారిందన్నా రు. ఇక్కడ నాయకులు రాజ్‌నాయక్, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.